క్లుప్తంగా

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో ట్యాలీలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్/ఫెయిల్ అయి 18–26 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అనేక కార్మికుల హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. ఈ సమస్యలపై కార్మికులు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు సిద్దరామయ్య, ప్రసాద్ తస్లీమ్, రమేష్, బాల చెన్నయ్య పాల్గొన్నారు.

సమతుల ఆరోగ్యంపై అవగాహన అవసరం

వైవీయూ : సమతుల్య ఆహారం, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా కడప నగరంలోని నిరంజన్ నగర్‌లో సమతుల్య ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి పౌష్టికాహారం తినడం ద్వారా ఆరోగ్యం సొంతమవుతుందని వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో వేతనాలు ఇవ్వండి

కడప ఎడ్యుకేషన్: మినిమం టైం స్కేల్ కింద కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా చేరిన 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చెంగలరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎంటీఎస్ కింద వీరిని టెర్మినేట్ చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేయడం తిరిగి విద్యా సంవత్సరం ప్రారంభంలో విధుల లోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. వీరిపై ప్రభుత్వం సానుభూతిగా వ్యవహరించి వీరిని ఒక్క రోజు మాత్రమే టెర్మినేషన్‌గా చూపించి వేసవి సెలవుల్లో కూడా వీరికి వేతనాలను చెల్లించాలన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా వీరికి కూడా వేసవి సెలవులు ఉండాలని కోరారు. వెంటనే ప్రభుత్వం వీరికి సంబంధించి సమరణ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఆర్‌పీకి ఆత్మీయ సన్మానం

కడప ఎడ్యుకేషన్: క్లస్టర్ రిసోర్సు పర్సన్ రామోహన్ అందించిన సేవలు మరువలేనివని కడప జయనగర్ కాలనీ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి అన్నారు. కడప జయనగర్ కాలనీ జిల్లా పరిషత్తు బాలికల హైస్కూల్లో గత 12 ఏళ్లుగా సీఆర్‌పీగా పనిచేస్తున్న రామ్మోహన్‌కు ఇటీవల 1998 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. ఈ మేరకు శుక్రవారం జగనగర్‌కాలనీ జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం భాగ్యవతితోపాటు ఉపాధ్యాయులు సీఆర్‌పీ రామోహన్‌ను సన్మానించారు. సన్మాన గ్రహీత, సీఆర్‌పీ రామ్మోహన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ కరపత్రాలు ఆవిష్కరణ

వైవీయూ : డీవైఎఫ్ఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన ఆవిష్కరించారు. శుక్రవారం వైవీయూలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత మంచి మార్గంవైపు పయనించాలన్నారు. యువత సమస్యలపై పోరాటం చేస్తున్న డీవైఎఫ్ఐను ఆయన అభినందించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ మేనెల 6, 7 తేదీల్లో బద్వేలులో డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

5న బౌద్ధారామాల సందర్శన

కడప కల్చరల్ : సుప్రసిద్ధ నందలూరు బౌద్ధారామాలను వైఎస్సార్ అన్నమయ్య జిల్లాలకు చెందిన బౌద్ధ సంఘాలు, చారిత్రక, వారసత్వ, పర్యాటక సామాజిక సేవా సంస్థలు సందర్శించనున్నాయి. మే 5న బుద్ధ జయంతిని పురస్కరించుకుని నగరానికి చెందిన పలు సంస్థలు తమ సంస్థల ప్రతినిధులతో కలిసి ఉదయం 7.00 గంటలకు బౌద్ధారామాలను చేరుకోనున్నారు. అక్కడ అన్ని సంస్థలు ఉమ్మడిగా బుద్ధుడి అష్టాంగ సూత్రాల గురించి వివరిస్తారు. బౌద్ధ ధర్మాన్ని పాటించాల్సిన అవసరం గురించి తెలుపుతారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో హజరత్ బాబా సాహెబ్ మియా మసీదు నిర్మాణానికి రూ.3లక్షలు చెక్కును మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఈ సంక్షేమ పథకాలను ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని సాయిపేటలోని హజరత్ బాబా సాహెబ్ మియా మసీదు నిర్మాణానికి వక్ఫ్ బోర్డు నుంచి రూ.3లక్షల చెక్‌ను అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. మసీదు కమిటీ ప్రెసిడెంట్ అబిద్ మియా, జనరల్ సెక్రటరీ మహబూబ్ ఖాన్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ ఇబ్రహీం మియా, కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పులివెందుల డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి చనిపోయిన కడప నగరం మాసాపేటకు చెందిన కరుణాకర్(20) కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2లక్షలు మంజూరయ్యింది. శుక్రవారం ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కరుణాకర్ తండ్రి ఓబులేసు, తల్లి రోజామణిలకు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం మాసాపేటకు చెందిన ఓబులేసు కుమారుడు కరుణాకర్ ఇటీవల ప్రమాదవశాత్తు పులివెందుల డ్యామ్‌లో పడి చనిపోయారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఈ మొత్తాన్ని మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి త్యాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, తోటక్రిష్ణ, బండి ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలను ముస్లింలు నమ్మరు

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు మాయమాటలను ముస్లిం మైనార్టీలు ఎప్పటికీ నమ్మరని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ముస్లిం మైనార్టీలను పూర్తిగా దూరం పెట్టారని, ఒక్కరిని కూడా కేబినెట్‌లోకి తీసుకోకుండా అవమానించారన్నారు.ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ముస్లింలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆయనకు గుర్తుకు వస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చట్టాలు చేసి, రిజర్వేషన్లు కల్పించి కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ వెంటే ఉంటారని స్పష్టం చేశారు.

నెమలికి నేర్పిన నడకలివే!



- జిల్లాలో వందకు పైగా నృత్యాలయాలు
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

పల్లెటూరి దప్పు చప్పుడు హృదయాన్ని ఉరకలెత్తిస్తుంది. శరీరాల్ని కదిలిస్తుంది. అప్రయత్నంగా పాదం కలిపి పదానికి అనువుగా నాట్యం చేస్తుంది. హుషారైన ఆ సంగీతానికి తగినట్లు శాస్త్రీయతను సంతరించుకుంటుంది. పల్లె పదమైనా, శాస్త్రీయ నృత్యమైనా ఫలితం ఆత్మానందమే. ఈ ఘనమైన వారసత్వ కళను రక్షించుకునేందుకు అన్ని దేశాలు ఏటా అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాయి. ఈ సందర్భంగా మన జిల్లాలో నాట్యరంగం స్థితిగతులపై కథనం.

కడప కల్చరల్ : కడపజిల్లాను కళలకు కాణాచిగా పేర్కొంటారు. ఒకప్పుడు ఈ గడ్డపై దాదాపు అన్ని లలిత కళలు గొప్పవైభవాన్ని చూశాయి. అందులో నృత్యం కూడా ఒకటి. 35 ఏళ్ల క్రితం వరకు జిల్లాలో నృత్యం కేవలం సంపన్నులకు మాత్రమే పరిమితమై ఉండేది. నిడుమోరు కృష్ణమూర్తిరాజు రాకతో జిల్లాలో ఈ కళ విస్తృతమైంది. 1970 నుంచి పదేళ్ల పాటు ఆయన ఎందరో శిష్యులను తయారు చేశారు. కడప నగరంలోని నృత్య గురువు చల్లా జగ్జీవన్‌రావు, రిటైర్డ్ రెవెన్యూ అధికారి ఉమామహేశ్వరరావు కూడా ఆయన శిష్యులే. కృష్ణమూర్తిరాజుకు మరో శిష్యుడు సుధా రాయుడు (సుబ్బయ్య) కూడా పలువురికి నృత్య శిక్షణ ఇచ్చారు. జగ్జీవన్‌రావు శిష్యురాలు స్పందన తన పేరిట నృత్యాలయాన్ని ఏర్పాటు చేసి వందలాది మందికి నృత్యం నేర్పారు. ఆ నృత్యాలయం నేటికీ కడప నగరంలో కొనసాగుతోంది. జిల్లాలో ప్రస్తుతం వందకు పైగా శాస్త్రీయ, మోడరన్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు కొనసాగుతుండడం విశేషం.

నృత్య కళకు అంకితం

పులివెందులకు చెందిన మొహిద్దీన్‌ఖాన్ అక్కడ వందలాది మందికి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కూచిపూడి పుట్టిన కృష్ణాజిల్లాలోని కూచిపూడి గ్రామంలో గురువుల వద్ద నృత్యం నేర్చుకోవడం ప్రారంభించారు. నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఈ విభాగం ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరులో 'శ్రీ నటరాజా కళాక్షేత్రం' ఏర్పాటు చేసి పులివెందులతో పాటు అక్కడ కూడా వందలాదిమందికి శిక్షణ ఇస్తున్నారు.

అందగా శిల్పారామాలు

సీనియర్ కవి ఎన్సీ రామసుబ్బారెడ్డి పాతికేళ్ల కిందట కడప నగరంలో 'త్యాగరాజ నృత్య సంగీత కళాశాల', సవేరా ఆర్ట్స్ ఆళ్లూరి వెంకటయ్య 'అన్నమయ్య ఆర్ట్స్ అకాడమి' నడిపారు. శాస్త్రీయ నృత్యం నేర్పే వారి కంటే ఇటీవల ట్రెండ్‌కు తగినట్లు స్టెప్పులు నేర్పే గురువులే ఎక్కువగా తయారయ్యారు. సమాజంలో వీరికంటూ మంచి డిమాండ్ కూడా ఉంది. కడప, పులివెందులలో శిల్పారామాలు వచ్చాక ప్రతి ఆదివారం శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తుండడంతో ఈ రంగానికి ఓ మోస్తరు సహకారం లభిస్తోంది. ఇటీవలి కాలంలో పాఠశాలల్లో కూడా పార్ట్ టైంగా నృత్యాచార్యులను ఏర్పాటు చేసుకుని సందర్భానుసారంగా ఆసక్తిగల బాలలను నృత్యరంగంలో ప్రోత్సహిస్తూ ఉన్నారు. నూతన విద్యా విధానంలో నృత్యానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామం.

ఘనమైన వారసత్వ కళ

నృత్యం మన సంప్రదాయానికి పట్టం కట్టిన వారసత్వ కళ. అభ్యసిస్తే శరీరం, మనసు అదుపులో ఉంటాయి. సమాజంలో గౌరవం లభిస్తుంది. భక్తితో ఆరాధిస్తూ సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

– చల్లా జగ్జీవన్‌రావు, నృత్య గురువు, కడప

మంచి ఆదరణ

భారతదేశ సంప్రదాయ కళల్లో నృత్యం ఒకటి. ప్రత్యేకించి మనదైన కూచిపూడి, పొరుగు రాష్ట్రానికి చెందిన భరతనాట్యం నేటికీ మంచి ఆదరణ పొందుతున్నాయి. మన జిల్లాలో బాలికలతోపాటు బాలురు కూడా నేర్చుకుంటూ ఉండడం విశేషం.

– విజయశాంతి, డ్యాన్స్‌మాస్టర్, కడప

ఆలయ తొలగింపుపై అసత్య ప్రచారం తగదు



ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన నమూనాను చూపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్: కడప నగరం మాసాపేటలోని పురాతన సీతారాముల, శివాలయాల తొలగింపుపై కొందరు పనిగట్టుకొని అసత్య ప్రచారం చేయడం తగదని ఆలయ కమిటీ ధర్మకర్త గున్నా గంగాధర్, గౌరవ సలహాదారు చిగురుపాటి త్యాగరాజు అన్నారు. శుక్రవారం మాసాపేట డివిజన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బక్కా అయ్యన్న ఆశయాలకు అనుగుణంగా ఆలయాన్ని పునర్నిర్మించడం, స్థానికులకు పట్టాలు ఇప్పించడంలో తాము కీలకంగా పనిచేస్తామన్నారు. నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ స్థానికులకు, ఆలయ కమిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారన్నారు. కొందరు ఆలయ స్థలం ఆక్రమణదారులు మత విద్వేషాలను రెచ్చగొట్టడంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ వారితో చేతులు కలిపారని ఆరోపించారు. 54 సెంట్ల ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేసేందుకు రూ.30లక్షలు మంజూరు చేసిన కమిషనర్‌ను అభినందిస్తున్నామన్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం తాము స్వచ్ఛందంగా ఆక్రమించిన స్థలం ఇస్తామని స్థానికులు 2010లో స్వయంగా సంతకాలు, వేలిముద్రలు వేసిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆలయ స్థలం ఆక్రమించిన వారి నుంచి స్వాధీనం చేసుకొని ఆలయాన్ని తప్పక నిర్మిస్తామన్నారు. ఇందుకోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని, కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పెంచల నరసింహులు, వరాహులు, కంచుపాటి బాబు, ఎం. ఫిలిప్, సత్యాల సాయి పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ పరిధిలో పలు అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సునంద తెలిపారు. నబీకోట–2 పరిధిలో ఓసీలకు, బహజన నగర్‌లో బీసీ–ఏ, రజకకాలనీలో ఓసీ, సాయిపేట–8, 9 ఓసీలకు, ఎస్ఆర్‌కే బ్యాక్–2 ఆయాకు ఈడబ్ల్యూఎస్‌కు, సున్నపుబట్టీలు–3 బీసీ–బి, పాత బస్టాండు–2 బీసీ–ఇ, బుడ్డాయపల్లె బీసీ–ఎ, శాస్త్రినగర్–3 బీసీ–బీలకు కేటాయించారన్నారు. మే 3వ తేదీలోగా ఆయా వర్గాలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9వ తేదిన కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

భగళాముఖి అలంకారంలో భువనేశ్వరీమాత



కడప కల్చరల్ : కడప నగరం చలమారెడ్డిపల్లెలోని దశమహావిద్య శ్రీ భువనేశ్వరీదేవి మందిరంలో శుక్రవారం అమ్మవారిని భగళాముఖి దేవిగా అలంకరించారు. వైశాఖ శుద్ధ అష్టమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముందు మందిర ప్రాంగణంలో హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి సాధకులు దేవి అష్టోత్తర శతనామావళి, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించి క్షేత్ర పాలకుడైన కాలభైరవస్వామికి విశేష అలంకారం, పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి కాగడ హారతి, వైభవ హారతి, ఏకాంత సేవ నిర్వహించారు. మందిర అర్చకుడు నాగరాజుస్వామి, మహోదర నాగేంద్ర ప్రసాద్ స్వామి పర్యవేక్షణలో ఆలయ అధ్యక్షుడు దండు లక్ష్మికళ కార్యక్రమాలను నిర్వహించారు.

పని ఒత్తిడి దరిచేరనీయొద్దు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగాలు చేసే వారు పని ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పనిచేసుకోవాలని కడప మైండ్ కేర్ ఆసుపత్రి న్యూరో, మానసిక వైద్య నిపుణులు హరిత అన్నారు. కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం హెల్త్‌క్లబ్, లైంగిక వేధింపులు, ఉమన్ ఎంపవర్మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పని భద్రత– ఆరోగ్యం దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పనిలో కలిగే ఒత్తిడి నుంచి బయటపడే మార్గాల గురించి వివరించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, హ్యూమానిటీ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు శ్రీవాణి సమన్వయకర్త ఆనంద్, రాధ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



దిగువపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువపల్లె, మైసూరారెడ్డి కాలనీల్లో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఇతర సమస్యలు వున్నా తెలపండని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరగా వాటిని మంజూరు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ హరి కేశవరెడ్డి, సర్పంచ్‌లు కుళాయప్ప, ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దస్తగిరి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ రఘు, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, రెవెన్యూ అధికారి స్వరూప్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డీ కొత్తపల్లెలో..

మండల పరిధిలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని డీ కొత్తపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినికి విప్రోలో ఉద్యోగం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ చదువుతున్న కె. సరళాదేవి విప్రో కంపెనీలో స్కాలర్ ట్రైనీ కింద ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూలో ఈమె చక్కటి ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సుజాత, మెంటార్లు వరప్రసాద్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫలితాల్లో చివరి స్థానం రావడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా చివరి స్థానం రావడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు చివరి స్థానం వచ్చిందని ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలో రాష్ట్రంలో ఇంటర్ ఫలితాల్లో చివరి స్థానంలో నిలవడానికి కారణమైన ఆర్‌జేడీ బాధ్యత వహించాలన్నారు. ఇంటర్మీడియట్ అధికారులు అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారిని తొలగించి ఇంటర్మీడియట్ ఫలితాలు మెరుగ్గా వచ్చేందుకు జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికారులు సమీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధికారులు సునీల్ కుమార్, సురేష్ నాయక్, రాహుల్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కడప ఎడ్యుకేషన్/కార్పొరేషన్: విద్యార్థులు తమ తల్లితండ్రుల కష్టాన్ని గుర్తెరిగి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. కడపలోని శ్రీ చైతన్య అకాడమి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రిన్సిపాల్ మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అభినందించారు. ఇందులో భాగంగా బైపీసీ విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచిన నఫీసాఖానంతో పాటు ఎంపీసీ విభాగంలో జిల్లాలో నాల్గవస్థానంలో నిలిచిన విదిషాను, ఎంఈసీ, సీఈసీ గ్రూపునందు జిల్లాటాపర్స్‌గా నిలిచిన శ్వేత, విజయదుర్గలను డిప్యూటీ సీఎం అభినందించారు. అంతకుముందు వీరిని స్థానిక అపూర్వ కళ్యాణమండపంలో మేయర్ సురేష్‌బాబు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించి మన జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆశీర్వదించారు.

ఉపాధ్యాయులు యంత్రాలు కాదు

కడప ఎడ్యుకేషన్: విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను పని యంత్రాలుగా భావించడం ప్రభుత్వం మానుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులకు వివిధ రకాల పనులను అప్పగించి వాటిని పర్యవేక్షించాలని చెప్పడం నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు. ఈ వేసవి సెలవుల్లో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతోపాటు ఉపాధ్యాయుల బదిలీలు, పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించడం వంటి సమస్యలు పరిష్కరించి నూతన విద్యా సంవత్సరంలో నూతనోత్సాహంతో విద్యాబోధన చేసేలా చూడాలని కోరారు.

సీపీఎస్ రద్దు ఉద్యమాన్ని జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ శ్రీయపురెడ్డి వెంకట జనార్దన్ రెడ్డి అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోనందుకు నిరసనగా మే డే (మే 1వ తేదీ) రోజున విశాఖపట్నంలో సీపీఎస్ రద్దు దీక్ష తలపెట్టామన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున సీపీఎస్ బాధితులు హాజరై సభను విజయవంతం చేయాలని జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు.

విశ్రాంత ఉద్యోగి ప్రశాంతంగా జీవించాలి



కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ ఆజాంను సన్మానిస్తున్న ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: వృత్తి రీత్యా ఉద్యోగాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కడప డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు విజయ్ భాస్కర్, రమ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన గౌస్ ఆజామ్‌ను పోస్టల్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌస్ ఆజామ్ తన 40 సంవత్సరాల వృత్తిలో పోస్టల్ శాఖ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు అహ్మద్ హుస్సేన్, మధుసూదన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు రెడ్డి బాషా, అమర్‌నాథ్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ కార్మిక సంఘాల గుర్తింపు అప్రజాస్వామికం'

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోస్టల్ కార్మిక సంఘాల గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికం అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డూ అదుపు లేకుండా అమ్మేందుకే పోస్టల్ ఉద్యోగులకు సంబంధించిన రెండు ప్రధాన కార్మిక సంఘాల గుర్తింపు రద్దును రహస్యంగా చేసిందన్నారు. పోస్టల్ ఉద్యోగులు చారిత్రత్మకమైన పోరాటాలు బ్రిటిష్ కాలం నుంచి ట్రేడ్ యూనియన్ హక్కుల కోసం నడుతపుతున్నారని గుర్తు చేశారు. ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ మేరకు పదోన్నతి కల్పించాలి

కమలాపురం : ఐసీడీఎస్ శాఖలో ఏర్పడిన ఖాళీలను అర్హత కలిగిన సీనియారిటీ ఉన్న అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం పోస్టులు భర్తీ చేస్తే సహించేది లేదని ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మాలేపాడు–1 అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త ఇటీవల రిటైర్ అయ్యారని, ఆ స్థానంలో 8 ఏళ్ల సీనియారిటీ ఉన్న మేరి హెప్సిబాకు పదోన్నతి కల్పించకుండా కేవలం 8 నెలల క్రితం నియమింపబడిన హెల్పర్ పుష్ప చందనాకు ప్రమోషన్ కల్పించడంపై వారు శుక్రవారం ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అవినీతికి పాల్పడుతున్న ఐసీడీఎస్ అధికారుల పట్ల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఖాళీలను భర్తీ చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కమలాపురం ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంజుల, సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు ఇతర నాయకురాళ్లు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

జమ్మలమడుగు : హజరత్ సయ్యద్‌షా గూడుమస్తాన్ వలి దర్గా ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక చదివింపులు చేయించారు. ఢిల్లీకి చెందిన ఆలీమ్ ఆరీఫ్ సాబ్రి పార్టీ, చోటి షబ్నమ్ ఖవ్వాలి పోటీలు జరిగాయి. తెల్లవారుజామున ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆయన కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీలో గంధోత్సవాలను వేరువేరుగా నిర్వహించారు. డీఎస్పీ నాగరాజు, అర్బన్ సీఐ సదాశివయ్య , రూరల్ సీఐ కొండారెడ్డిల పర్యవేక్షణలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

రేపు సగర కులస్తుల వివాహ పరిచయ వేదిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాజీవ్ సర్కిల్‌లోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సగరకులస్తుల ఆత్మీయ సమావేశం, ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సగరసంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారిగా సగర జేఏసీ ఆధ్వర్యంలో సగర కులస్తులకు ఉచిత వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. సగర కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పని చేయని ఆధార్ సెంటర్

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని నాల్గవ సచివాలయంలో ఉన్న పర్మనెంట్ ఆధార్ సెంటర్ రెండు మాసాలుగా పని చేయడం లేదు. ఆధార్ సేవలు అందించే ల్యాప్‌టాప్ పని చేయకపోవడంతో సేవలు అందించలేక పోతున్నామని సిబ్బంది తెలిపారు.

కూలర్ వితరణ

చింతకొమ్మదిన్నె : చిన్నముసల్‌రెడ్డిపల్లె గ్రామంలోని అనాథ వికలాంగుల సేవా కేంద్రానికి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వి.స్వరూపరాణి కూలర్ వితరణ చేశారు. ఎంఈఓ వెంకట్రామిరెడ్డి దీనిని అందజేశారు.